## క్లుప్తంగా

### పరామర్శ



కావలి : పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కిలగుంట మాల్యాద్రి అనారోగ్యంతో నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మాల్యాద్రి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు



చేజర్ల: అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ స్క్వాడ్ ఏజీ(అసిస్టెంట్ జియాలజిస్ట్) కె హరకుమార్‌నాయుడు హెచ్చరించారు. మండలంలోని వావిలేరులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు సాగిస్తున్నారనే సమాచారంతో గురువారం ఆయన దాడులు నిర్వహించారు. అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న జేసీబీతో పాటు తెల్లరాయిని స్వాధీనం చేసుకుని మండల రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆయన వెంట వావిలేరు వీఆర్వో పెంచలయ్య, వీఆర్‌ఏ నాగభూషణం ఉన్నారు.

### వాహనాల తనిఖీ



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఎస్సై విశ్వనాథరెడ్డి గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



జలదంకి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రమాదేవి అన్నారు. మండలంలోని జమ్ములపాళెంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను గురువారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వం గృహ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ప్రసాద్‌కు సూచించారు. ఆమె వెంట జమ్ములపాళెం సర్పంచ్ బుర్రి శ్రీవేణి ఉన్నారు.

### వైభవంగా శ్రీచక్రచర మహామేరు ప్రతిష్ట



అనుమసముద్రంపేట: చిరమనలోని కామాక్షీదేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శ్రీచక్రచర మహామేరు ప్రతిష్ఠను గురువారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నరసింహ శర్మ, సురేష్‌స్వామి ఆధ్వర్యంలో తొలుత నవగ్రహ, మహాకాళి, మహాలక్ష్మి, చండీ, తదితర యాగాలు నిర్వహించారు. అనంతరం శ్రీచక్రచర మహామేరు ప్రతిష్ట జరిపారు. నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి దంపతులు, మద్దూరు వజ్రమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### టైల్స్ పంపిణీ



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు రెండో విడత కింద చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వ సరఫరా చేసిన టైల్స్‌ను ఎంఈఓ మస్తాన్‌వలి గురువారం పంపిణీ చేశారు. అప్పసముద్రం, బిజ్జంపల్లి, గడ్డంవారిపల్లి, ఉదయగిరి మెయిన్, నార్తు, దళితవాడ, బీసీ కాలనీ, గంగిరెడ్డిపల్లి, దుర్గంపల్లి పాఠశాలలకు టైల్స్‌ను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎంఈఓ వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచిచూశారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

# మహిమాన్వితం..గుహమల్లేశ్వరుడి క్షేత్రం

•నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



నల్లగొండ్ల క్షేత్రం (ఇన్‌సెట్లో) విశేషాలంకారంలో గుహమల్లేశ్వరుడు

వింజమూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నల్లగొండ్ల గుహమల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈ క్షేత్రంలో ఆదిశేషుని పడగను పోలిన కొండ గుహలో త్రయాంబిక సమేత మల్లికార్జునస్వామి స్వయంభువుగా వెలిసి భక్తులను కటాక్షిస్తున్నారు. మండు వేసవిలో సైతం కొండ గుహ అతిశీతలంగా ఉండడం విశేషం. గుహలోకి ఒకరు మాత్రమే పాకుకుంటూ వెళ్లి స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. పున్నమినాడు గుహలోని గంగాధరుడిపై వెన్నెల కాంతి ప్రసరించిన సమయాన శివపంచాక్షరి మహామంత్రాన్ని జపిస్తే మోక్షప్రాప్తి కలుగుతుందని ఇక్కడి భక్తుల నమ్మకం. క్రీ.శ 3వ శతాబ్దంలో కొండగుహలో శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతీతి. క్రీ.శ 14వ శతాబ్దంలో గుహమల్లేశ్వరుడికి ప్రతి మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమికి వేడుకలు నిర్వహించే వారని, అప్పట్నుంచి వేడుకలు కొనసాగుతున్నాయని చారిత్రక ఆధారం.

**ఉత్సవాలు ఇలా..**

నల్లగొండ్ల క్షేత్రంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. తొలిరోజు అగ్ని ప్రతిష్టాపన, రుద్రాభిషేకాలు, నంది వాహనానికి అభిషేకాలు, అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన, గ్రామోత్సవం, గోపననంది గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 18న రుద్రాభిషేకం, జలాభిషేకం, మృత్యుంజయ హోమం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

## దక్షిణ కాశీ..బ్రాహ్మణక్రాక శివాలయం



మహాశివరాత్రికి ముస్తాబవుతున్న బ్రాహ్మణక్రాక శివాలయం

జలదంకి: బ్రాహ్మణక్రాకలోని పురాతన శివాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ శివాలయాన్ని హరిహరబుక్కరాయల కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారం. ఇక్కడ కాశీలో మాదిరిగానే శివుడి ఎదురుగా శ్మశానం, అమ్మవారి ఎదురుగా కోనేరు ఉండడంతో ఈ ప్రాంతంలో దక్షిణ కాశీగా పేరొందింది. శివాలయం కోనేరులో స్నానమాచరించి, నవగ్రహాలను పూజించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటే సకల దోషాలు తొలగుతాయని ప్రతీతి. ఈ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున రాత్రి కోనేరులో ఆదిదంపతుల తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని మండల పరిసర గ్రామాల భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు.

### ఆధ్యాత్మిక నిలయం 'సిద్ధనకొండూరు'

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులోని ఆధ్యాత్మిక నిలయం సిద్ధేశ్వరాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. కొండపైనున్న సిద్ధేశ్వరుడి క్షేత్రంలో గంగమ్మ, వినాయకుడు, అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. జోడినాగులు, పంచముఖ నాగుల విగ్రహాలు భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. కొండ మీద ఏర్పాటు చేసిన భారీ పరమ శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతున్న ఈ క్షేత్రంలో సిద్ధేశ్వరుడికి నిత్యం ప్రత్యేక పూజలు జరుపుతుంటారు. మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం నుంచి క్షేత్రంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయశాఖ అధికారులు ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



సిద్ధేశ్వరుడి క్షేత్రంలోని భారీ శివుడి విగ్రహం

### సింహ వాహనంపై భీమేశ్వరుడు



సంగం:వంగల్లులోని కామాక్షీదేవి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిదంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. ఆలయ ధర్మకర్త పగడాల రఘురామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఉదయగిరి: గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు గణపతి, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, అన్నపూర్ణాదేవి, సాయిబాబా, సిద్ధేశ్వరస్వామి, నందీశ్వరుడు, సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. వేదపండితులను గ్రామపెద్దలు అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు సత్కరించారు. శివరాత్రి సందర్భంగా శనివారం ఆదిదంపతుల కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వీఏఏలకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రామిరెడ్డి

జలదంకి: రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి కోరారు. మండలంలో ఈక్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20లోగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం జలదంకి వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలతో సమావేశమై పంటకోత ప్రయోగాలు, వైఎస్సార్ పొలంబడి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తదితరాలపై అవగాహన కల్పించారు. వరి సాగు పూర్తయిన తరువాత మినుము పంట సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఓ శైలజ, వీఏఏలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు కావలి విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కావలి రూరల్ : పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సీహెచ్ మదన్ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ వై విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాజట్టుకు ప్రాతినిధ్యం వహించిన విశ్వోదయ విద్యార్థులు సీహెచ్ మదన్, ఎం అరుణ్‌కుమార్, ఎస్‌కే వసీం, ఎస్‌కే రసూల్, పీ జాషువా ఉత్తమ ప్రదర్శన కనబరిచారని చెప్పారు. అందులో ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచిన సీహెచ్ మదన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం హర్షణీయమన్నారు. హెచ్‌ఎం ఎన్‌డీ చౌదరి, ఉపాధ్యాయులు కే శివకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించండి



చేజర్ల: చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

చేజర్ల: తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కోరారు. గురువారం ఆమె మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులను కలుసుకుని చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. చేజర్ల ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. ఆమె వెంట ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి కుమారుడు రాణాప్రమోద్, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు యూటీఎఫ్, సీపీఎం బలపరుస్తున్న అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పీ బాబుల్‌రెడ్డికి మద్దతుగా జనవిజ్ఞాన వేదిక, సీఐటీయూ నాయకులు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో షేక్ సందానీ, వాగాల శ్రీహరి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడిని అధిగమించాలి



కావలిలో అవగాహన కల్పిస్తున్న డీడీ రమాదేవి



మర్రిపాడు కేజీబీవీలో..



కలిగిరి కేజీబీవీలో..

కావలి రూరల్: పదోతరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని సోషల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి సూచించారు. పట్టణంలోని ఎస్‌డబ్ల్యూ బాలుర వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడంతో ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. పరీక్షలపై భయాన్ని వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలను రాయడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని వివరించారు. జవహర్‌భారతి కళాశాల వైస్‌ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యంనాయుడు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,వార్డెన్లు పాల్గొన్నారు.

**పరీక్షలపై భయాన్ని వీడాలి**

మర్రిపాడు: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ సూచించారు. మర్రిపాడులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు పరీక్షలపై గురువారం అవగాహన కల్పించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, గ్రంథాలయాధికారి నారాయణరావు పాల్గొన్నారు.

**కేజీబీవీలో 'పరీక్షా పర్వ్ 4.0'**

కలిగిరి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 'పరీక్షా పర్వ్ 4.0' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ కే విజయచంద్ర హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విభాగాలు, బాలల హక్కుల సంఘాలు సంయుక్తంగా 'పరీక్షా పర్వ్ 4.0' కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా ఈ నెల 20 వరకు ప్రభుత్వ డైట్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి ప్రశాంతంగా రాయాలని సూచించారు. ప్రిన్సిపల్ కే సుప్రియ, ఉపాధ్యాయినులు సుజన, కుమారి, శ్యామల, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే మేకపాటికి పరామర్శ



వింజమూరు: ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డిని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గువ్వల కృష్ణారెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని మర్రిపాడులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యేను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

### ఆశీర్వచనం

ఆత్మకూరురూరల్: గండ్లవేడులో బుధవారం రాత్రి జరిగిన కొల్లి దొరస్వామినాయుడు, సుస్మిత దంపతుల వివాహ రెసెప్షన్‌కు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, కొల్లి అఖిల్ నాయుడు, సెట్నెల్ సీఈఓ బీ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులునాయుడు, పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తదితరులు హాజరయ్యారు.

### నేడు ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం

వింజమూరు: స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆపస్మా నాయకులు జీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ఆత్మీయ సమావేశానికి మండలంలోని ప్రభుత్వ,ప్రైవేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

### హోరాహోరీగా గ్రిగ్ పోటీలు

వింజమూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 98వ గ్రిగ్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా రెండోరోజైన గురువారం టెన్నీకాయిట్, కబడ్డీ, త్రోబాల్ పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. శుక్రవారం కూడా పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ ఎస్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైభవంగా కల్యాణోత్సవం



చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలోని గ్రామదేవత గండారపమ్మ ఆలయంలో జరుగుతున్న వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం అశ్వత్‌నారాయణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం గండారపమ్మకు కుంకుమార్చన, శాంతిహోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా వలమాల రఘురామిరెడ్డి, సుశీలమ్మ వ్యవహరించారు. కాగా శుక్రవారం గ్రామపొంగళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి తెలిపారు.

## ఘనంగా కరటంపాడు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



అతిథులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: కరటంపాడులోని గూటూరు కన్నయ్యనాయుడు మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి నాయకుల వేషధారణలతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరటంపాడుకు చెందిన గూటూరు మురళీ కన్నబాబు, గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు రానున్న వేసవి సెలవులు ముగిసేలోగా రెండు అదనపు తరగతి గదులు తన సొంత నిధులతో నిర్మిస్తామని కన్నబాబు ప్రకటించారు. వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ తమ గార్లపాటి ఫౌండేషన్ ద్వారా గత రెండు దశాబ్దాలుగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.72 లక్షల ప్రోత్సాహక నగదును అందజేసి ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించామని వివరించారు. తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆత్మకూరు ఎంఈఓ షేక్ నజీర్ బాషా, మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్త్రీ,శిశు సంక్షేమానికి ఎస్‌డీజీ సర్వే ప్రామాణికం



అశ్వనీపురంలో ఎస్‌డీజీ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: స్త్రీ,శిశు సంక్షేమానికి ఎస్‌డీజీ సర్వే ప్రామాణికమని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అశ్వనీపురం, జంగాలపల్లి, దేపూరు, తదితర గ్రామాల్లో ఎస్‌డీజీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమమే ధ్యేయంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపడుతున్న ఎస్‌డీజీ సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆధార్‌కార్డులు లేని వారు త్వరితగతిన తమ సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద చేయించుకోవాలని సూచించారు. సంక్షేమ సహాయకుడు రవూఫ్, ఏఎస్ఎం పద్మ, మహిళా పోలీసు గౌసియా, వలంటీర్లు రామ్మోహన్, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్

కొండాపురం: ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతంగా చేయాలని కందుకూరు డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కొండాపురం, వరికుంటపాడు మండలాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరుకు నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం డివిజనల్ ఈఓపీఆర్డీ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ శేషసాయి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## లేగ దూడల ప్రదర్శన



లేగదూడలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

అనుమసముద్రంపేట: మండలంలోని పానుగోడులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శనను గురువారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి జేడీ రమేష్‌నాయక్, డీడీ సోమయ్య హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి జాతీయ కృత్రిమ గర్భధారణ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద పెయ్యదూడల పోషణకు పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తోందని వివరించారు. అనంతరం పెయ్యదూడల పెంపకంలో పాటించాల్సిన మెళకువల అవగాహన కల్పించారు. అనంతరం పోషికంగా ఉన్న లేగదూడలకు బహుమతులు అందజేశారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు సుబ్బానాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, అసిస్టెంట్లు మసూద్, వసంత రాయల్, దేవకుమార్, మస్తాన్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

## 108 శివలింగాల దివ్యదర్శనం



శివరాత్రి విశిష్టతను వివరిస్తున్న బ్రహ్మకుమారీలు

అల్లూరు: స్థానిక విశ్వకళ్యాణి భవన్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో గురువారం రాత్రి 108 శివలింగాల దివ్యదర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు సుమలత, ప్రమీల మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా 108 శివలింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం నృత్యకళాకారులు నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.